
కథ



# డెడ్‌లాక్

— ఆకెళ్ళ శివప్రసాద్

సత్యమూర్తి మనసు మనసులో లేదు-కళ్ళ ముందు కాలం తాను 'ఇంటర్‌నెట్' లో చూసిన దాని కన్నా వేగంగా సాగిపోయింది.

ఇంతకు ముందు ఎప్పుడూ ఇలాంటి ఫీలింగ్ వెంటాడలేదు...

తను ...

ప్రత్యేకంగా అటువైపు ఆసక్తి చూపేసరికి క్షణక్షణం భయపడుతున్నట్టుగా ఉంది.

తన బాధ్యతలు మరోసారి గుర్తుకొచ్చాయి.

చాలా చేయాలి...

ఇద్దరు పిల్లలూ ఇంకా చిన్నవాళ్ళు...

ఒకడు ఆరో తరగతి... ఇంకొకడు మూడో తరగతి... వాళ్ళని చదివించాలి.

ప్రయోజకుల్ని చేయాలి...

తనకేమైనా అయితే వాళ్ళు ఏమౌతారు ?

కరిగిపోతున్న సెకండ్లు విషం కక్కుతున్న పాముల్లా అనిపించాయి.

భార్య పెద్దగా చదువుకోలేదు.

తన కేమైనా అయితే...

భార్యకి 'కాంపెన్‌సేటరీ గ్రౌండ్స్' మీద ఉద్యోగం వొస్తుందా ?

వచ్చినా ...

తనకి వచ్చినంత జీతం వస్తుందా ?

తాను డ్రా చేస్తున్న జీతమే బొటాబొటిగా సరిపోతుంది.

ఆమె...

ఎలా ఉంటుంది ?

ఎలా బ్రతకగలదు ?

కూర కూడా 'బేరం' ఆడి తీసుకురావడం తెలీదు...

సరుకుల లిస్టు రాసిచ్చి తీసుకురమ్మన్నా ఒక్కోసారి కన్‌ఫ్యూజ్ అయిపోతుంది.

అమాయకురాలు...

శుద్ధ పల్లెటూర్లో పుట్టింది... అక్కడే పెరిగింది... తనతో, పెళ్ళి అయ్యాక పట్నం మొదటిసారి చూసింది...

తన ఇంటి ప్రపోజల్ ఏమౌతుంది ?

ఇంటిని ఎలా కట్టాలి ?

సమయం తక్కువగా ఉంది...

డిపార్ట్‌మెంటల్ పరీక్షకు ప్రిపేర్ అవ్వాలి... పరీక్ష ఈసారి పాస్ అయిపోవాలి...

ప్రమోషన్ ఇప్పట్లో రాకపోయినా, స్పెషల్ 'పే' వస్తుంది.

అదృష్టం బావుంటే..."ఆయుష్ను ఉండగానే ప్రమోషన్ కూడా రావొచ్చు...

అసలు ప్రమోషన్ ఖచ్చితంగా రావాలనే కదా... ఆ 'వల' లో చిక్కుకుంది....

ప్రపంచమంతా కంప్యూటర్లతో హోరెత్తిపోతోంది....

కంప్యూటర్ గురించి తెలీకపోవడమంటే నిరక్షరాస్యుడిగా ఉండడమే...

ఆఫీసులో కూడా పెద్ద పెద్ద బ్రిటిష్ కాలం నాటి రిజిస్టర్లు పోయి చిన్న చిన్న కంప్యూటర్లు వొస్తున్నాయి...

మొదట్లో ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా ప్రతివాడూ కంప్యూటర్ నేర్చుకోవాల్సి వచ్చింది...

ఆ పరంపరలో...

సత్యమూర్తి కూడా ఆఫీసు కంప్యూటర్ మీదే 'డేటా ఎంట్రీ' నేర్చుకున్నాడు...

కంప్యూటర్ సెల్ ఇన్‌చార్జిని పట్టుకుని బుల్లి బుల్లి ప్రోగ్రాములు చేయడం నేర్చుకున్నాడు...

అలా నేర్చుకుంటున్న సమయంలో ఆ ప్రోగ్రామర్ సత్యమూర్తిలోని దీక్షాదక్షతలని మెచ్చుకుని...

"నాకు డాటా ఎంట్రీ కాంట్రాక్టులు వొస్తుంటాయ్... మీరు చేస్తారా... ? మీకూ ఎంతో కొంత ఆదాయం వస్తుంద"న్నాడు...

సత్యమూర్తి అట్టే ఆలస్యం చేయకుండా ఒప్పుకున్నాడు... ఓ ఆరు నెలలు గడిచేసరికి కొంత అనుభవమే కాక ఆదాయం కూడా వచ్చింది...

ప్రోగ్రామర్‌కి మరింత దగ్గరయ్యాడు...

ఆఫీసులో తన పని తాను ఇండిపెండెంట్‌గా చేసేస్తున్నాడు.

అప్పుడే డిపార్ట్‌మెంటల్ పరీక్ష వచ్చింది.

పరీక్షకి నోటిఫికేషన్ వచ్చిన వెంటనే ...

ఆఫీసర్ పిలిచి...

"నువ్వు తప్పకుండారాయవోయ్... ఇంటర్వ్యూ వొస్తే నీ కంప్యూటర్ నాలెడ్జి గురించి ఆఫీసంతా తెలుసు కనుక సెలక్షన్ వస్తుంది" అన్నాడు.

రెట్టించిన ఉత్సాహంతో పరీక్షకి అప్లయ్ చేశాడు.

ప్రిపేర్ అవుతున్నాడు.

ఖచ్చితంగా వ్రాత పరీక్షలో క్వాలిఫై అవుతాడు అనే నమ్మకం వచ్చింది.

కంప్యూటర్‌కి సంబంధించి ఈ ప్రశ్న రావొచ్చని అందరూ అనుకుంటున్నారు.

ప్రోగ్రామర్‌తో ఉన్న పరిచయం పురస్కరించుకుని కంప్యూటర్స్ గురించి సవివరంగా తెలుసుకోవాలని ఆ రోజు సాయంత్రం ప్రోగ్రామర్‌తో పాటు వాళ్ళింటికి వెళ్ళాడు.

కాసేపు సీరియస్‌గా ఆఫీసు టాపిక్ చర్చించుకున్నారు-మాటలో మాటగా ...

చర్చ 'ఇంటర్‌నెట్' మీదకి వెళ్ళింది.

అప్పటికే ఇంటర్‌నెట్ కనెక్షన్ తీసుకున్న ఆ ప్రోగ్రామర్ ఇంటర్‌నెట్‌లో వచ్చే తెలుగు పత్రికలని చూపెట్టాడు. చాలా ఆశ్చర్యంగా అనిపించింది సత్యమూర్తికి.

"ఇంటర్‌నెట్‌లో ప్రపంచమంతా ఉందండి... ఏ విషయమైె ఏ సమాచారం కావాలన్నా క్షణాల్లో గట్టిగా మాట్లాడితే సెకన్లో వస్తుంది... హాలీవుడ్ సిన్మాలు చూడా

లన్నా... టెక్నాలజికల్ డెవలప్‌మెంట్స్ తెలుసుకోవాలనుకున్నా... అదీ ఇదీ... అనే తేడా లేకుండా అన్నింటికీ ఇంటర్‌నెట్ కావాలి".

"అసలు ఇరవై నాలుగు గంటలు చాలడం లేదనుకోండి" అనేసి...

"ఈ మధ్య ఓ కొత్త అంశం వస్తోంది... అంటే నాకు కొత్తగా ఉన్నదన్నమాట... నిజానికి ఎప్పటి నుంచో ఉండి ఉంటుందది" అన్నాడు.

"ఏమిటండీ?" అంతగా ఆసక్తిలేకపోయినా అడిగాడు.

"డెత్ క్లాక్ ?"

"డెత్ క్లాకా ?"

"అవునండీ... డెత్ క్లాక్ ద్వారా మన ఆయువు ఎంత ఉందో తెలుస్తుంది... చైనీస్ వాళ్ళ సంప్రదాయాలని... నమ్మకాన్ని అనుసరించి దీన్ని తయారు చేశారు... మన జీవితంలో ఇంకెన్నాళ్ళు బతుకుతామో తెలుస్తుంది..."



"అలాగా..." అంటూనే...

"ఇదేదో వెరయిటీగా ఉందే..."

"వెరయిటీనేనండి... మనం ఎలా పుడతామో మనకి తెలీదు, మన మరణం మాత్రం దీనివల్ల తెలుస్తుంది..." అని అప్పటికప్పుడు ...

'డెత్ క్లాక్ డాట్ కామ్' అని ఆపరేట్ చేశారు...

సత్యమూర్తి పుట్టిన తేదీ వగైరా వివరాలు అడిగాడు...

అయిదు నిముషాల తరువాత...

తెరమీద...

కొన్ని అంకెలు వచ్చాయి.

సెకన్లు వేగంగా సాగిపోతున్నట్టుగా వచ్చింది...

బాలెన్సు లైఫ్... లెక్క వేస్తే...

పదహారు సంవత్సరాల ఎనిమిది నెలల పదిహేను రోజుల ఆరు గంటల ఇరవై మూడు సెకన్లుగా వచ్చింది...

అప్పటిదాకా బాగానే ఉన్న సత్యమూర్తితో ఇంతే నీ బాలెన్సు లైఫ్, పదిహేడు ఏళ్ళు కూడా లేదు. అని తేల్చేసరికి నిస్సత్తువ ప్రవేశించింది...

అదిచూసిన ప్రోగ్రామర్ మరింత కంగారు పెట్టినట్టు-

"నాకు ఇంకా ముప్పై ఏళ్ళ పైచిలుకు ఆయుర్దాయం ఉందండీ..." అన్నాడు.

ఆ మాటతో మరింత డల్ అయిపోయాడు !

!

ఆ రాత్రి ...

నిద్రలేదు...

ఆ మర్నాడు...

పరీక్షకి చదవలేదు...

బాధ్యతలు ఎలా తీర్చాలన్న ఆలోచన తప్ప !!

★ ★ ★ ★

మనసు బాగోక లంచ్ బాక్స్ తెచ్చుకోలేదు సత్యమూర్తి.

రెండున్నరకి బాగా ఆకలి అనిపిస్తోంటే క్యాంటీన్‌కి కదిలాడు. క్యాంటీన్‌లో అర్ధ రూపాయి సైజులో ఉన్న మూడు పూరీలు లేహ్యంలా ఉన్న కుర్మాలో నంజుకుని తిన్నాడు.

అక్కడే కాసేపు కూర్చుండిపోయాడు.

అనవసరంగా చాలాసార్లు నిట్టూర్చాడు..

అక్కడి నుండి అరగంట తరువాత ఆఫీసులోకి కదిలాడు.

ఆఫీసులోకి వొస్తూ నే...

ప్రోగ్రామర్‌కి ఏక్సిడెంట్ జరిగిందన్న వార్త తెలిసింది.

లంచ్ నుండి ఆఫీసుకు వస్తుంటే అతని స్కూటర్‌ని ఇసుక లారీ గుద్దేసిందట...

ఆస్పత్రిలో చేర్చారుట ఎవరో ...

ఆఫీసంతా పరామర్శించడానికి కదిలారు.

సత్యమూర్తి ఏదో అర్జెంట్ పని ఉండి ఆఫీసుల్లో ఉండిపోయి ఆ సాయంత్రం ఆఫీసు నుండి వెళ్ళాడు.

అప్పటికి ఆఫీసు వారంతా వెళ్ళిపోయారు.

ప్రోగ్రామర్ భార్య వార్డ్‌లోనే ఎదురై విషాదంగా పలకరించింది.

డ్రెస్సింగ్ చేస్తున్నారుట.

అరగంట తరువాత వెళ్ళారు-రూమ్‌లోపలికి...

ప్రోగ్రామర్ వళ్ళంతా గాయాలు అయ్యాయి. చాలా కట్లు కట్టారు. అయితే స్పృహలోనే ఉన్నాడు.

రక్తం చాలా పోయిందని, ఏక్సిడెంట్ ఎలా జరిగిందో అతని భార్య చెప్పింది.

సత్యమూర్తి ధైర్యం చెపుతున్నట్లు బెడ్ పక్కనే కూచుని-

"డోంట్ వర్రీ... మీ లైఫ్ స్పాన్ ఇంకా ముప్పై ఏళ్ళు దాటే ఉంది..." అన్నాడు.

ఇంటర్‌నెట్ గుర్తు తెస్తూ-భారంగా ఊపిరి పీల్చి, నెమ్మదిగా శక్తినంతా కూడదీసుకుని

-"ఎంతకాలం బ్రతుకుతామనే విషయం కన్నా ఎలా బ్రతికామనే విషయం ముఖ్యం... కాకిలా కలకాలం బ్రతకాలా ?... డెత్ క్లాక్ మన ఆయుష్షుని చూపెట్టి భయపెట్టడానికి ఏర్పాటు చేసిందని అనుకోను... బద్ధకించకుండా, నిర్లక్ష్యం చేయకుండా సజావుగా జీవించడానికి హెచ్చరిక జారీ చేస్తుందనుకుంటాను...' అన్నాడు ప్రోగ్రామర్.

కాసేపు అక్కడే ఉండి బైటికి వచ్చిన సత్యమూర్తి మనసు తేలికపడింది....

ఇప్పుడు ...


జీవన రహస్యం తెలుసుకున్నానన్న ఆనందంతో సత్యమూర్తి మనసు పరవళ్ళు తొక్కింది.

●

## మహాకాయుడు!



లావుపాటి వాళ్లను మనం చాలామందిని చూశాం! అయితే ఇంతటి మహాకాయుణ్ణి ఎక్కడ చూళ్లేదుగదూ! ఉక్రేయిన్‌లో ఉన్నాడీ భారీకాయుడు! 48 ఏళ్ల ఇతని పేరు వాస్‌మల్‌మచోవ్. 450 కేజీల బరువు! నాలుగు సంవత్సరాల క్రితం ఇంటి నుంచి వచ్చాడు...ఇంట్లో వారు అతని మహాతిండిని భరించలేకపోవడం వల్ల ప్రస్తుతం తన శరీరాన్ని ప్రదర్శిస్తూ పొట్టబాగానే పోసుకుంటున్నాడు.



## అందాల విందు

నటి డార్సీ(?) మహన్న విన్యాసాలు చూసి ఇంగ్లాండులో యువకులు వెర్రెత్తిపోతున్నారు. బ్రిటన్‌లోని ఓ దుస్తుల కంపెనీ వారు తమ దుస్తుల ప్రచారం కొరకు ఓ లక్ష పౌండ్లు వెచ్చిస్తూ ముద్దుగుమ్మహన్నాను ఇందుకొరకు ఎన్నుకొన్నారు! అందుకు ఆ టక్కులాడి సొగసులను ఇంద్రధనుస్సులా వంచి, సౌందర్యాల విందు చేసింది!

-కొడిమెల